హైదరాబాద్
9-10-2023
సంపుటి:08
సంచిక: 364
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## ఉదయ్‌పూర్ డిక్లరేషన్ అమలు చేస్తాం



**ఓయూ జేఏసీ నేతలకు సీడబ్ల్యూసీ సభ్యుడు జితేంద్రసింగ్ హామీ**

**తమకూ టికెట్లు ఇవ్వాలంటూ ఢిల్లీలో ఆశావహుల ధర్నా**

న్యూఢిల్లీ, తెలంగాణలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమకు కూడా పోటీ చేసే అవకాశం కల్పించాలని పలువురు ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు, ఆశావహులు కాంగ్రెస్ హైకమాండ్‌ను కోరారు. ఆదివారం ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరుగుతున్న నేపథ్యంలో.. వారు అక్కడి వార్‌రూం ఎదుట భైఠాయించారు. తాము తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నామని, అనంతరం కాంగ్రెస్‌లో చేరి.. పార్టీ కోసం ఎంతో కష్టపడి పని చేస్తున్నామని అన్నారు. "రాహుల్ జీ.. కాంగ్రెస్ పార్టీ ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను అమలు

2లో

## 10న ఆదిలాబాద్‌లో అమిత్ షా సభ

**సాయంత్రం శంషాబాద్ సభ రద్దు.. వివిధ వర్గాల ముఖ్యులు, మేధావులతో భేటీ**



హైదరాబాద్: ఈ నెల 10న మధ్యాహ్నం ఒంటి గంటకు ఆదిలాబాద్‌లోని డైట్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగసభలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొనున్నారు. ఇప్పటికే ఈ నెల 1న మహబూబ్‌నగర్, 3న నిజామాబాద్‌లో నిర్వహించిన సభల ద్వారా రాష్ట్రంలో పార్టీపరంగా ప్రధాని మోదీ ఎన్నికల శంఖాన్ని పూరించిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా అమిత్ షా సభను బీజేపీ నిర్వహించనుంది. 10న రాజేంద్రనగర్ నియోజకవర్గపరిధిలోని శంషాబాద్‌లో అదేరోజు సాయంత్రం అమిత్ షా సభ నిర్వహించాలని తొలుత భావించింది. అయితే ఈ సభ రద్దు

2లో

## రాష్ట్రంలో మరణ మృదంగం!

**రాష్ట్రంలో మరణ మృదంగం!**


**మద్యం అమ్మకాల్లో 7 వేల కోట్ల దోపిడీ**

**బీజేపీ పట్టించుకోదేం: సోమిరెడ్డి**



అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): "ఢిల్లీలో మద్యం వ్యాపారంలో రూ.100 కోట్ల అవినీతి జరిగిందని కేంద్ర ప్రభుత్వం అనేక మందిపై కేసులు పెట్టి జైలుకు పంపింది. ఈ రాష్ట్రంలో అదే మద్యం వ్యాపారంలో రూ.వేల కోట్ల అవినీతి జరుగుతోంది. బీజేపీ ఎందుకు పట్టించుకోదు?" అని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. "అవినీతి రూ.100 కోట్లయినా కేసులు పెట్టాల్సిందే. కాని ఈ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం వ్యాపారంలో రూ.వేల కోట్ల అవినీతి జరుగుతోంది. మద్యం బ్రాండ్లు వాళ్లవే. సరఫరా

2లో



## 70 సీట్లకు ఓకే!

- సగానికి పైగా స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసిన కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ
- ఈ నెల 16న లేదా 18న తొలి జాబితా విడుదలకు కసరత్తు
- బస్సు యాత్ర తర్వాత ప్రకటించే యోచన కూడా...
- మిగతా సెగ్మెంట్లకు అభ్యర్థుల ఖరారుపై మరోసారి భేటీ
- ఏకాభిప్రాయం రానిచోట ఇద్దరేసి పేర్లతో పార్టీ సీఈసీకి ప్రతిపాదనలు.. దరఖాస్తులన్నీ పరిశీలించాం: ఠాక్రే

2లో

## ముదిరాజ్‌లకు 11 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలి



- ఒక్క సీటూ ఇవ్వకుండా ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టిన బీఆర్ఎస్
- ముదిరాజ్‌లపై నమ్మకం లేని పార్టీలకు ఓటెందుకు వేయాలి?
- ముదిరాజ్ ఆత్మగౌరవ సభలోబీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్
- 'సీట్లు మావే ఓట్లు మావే' అనే నినాదంతో వెళ్లాలని పిలుపు

అడ్డగుట్ట,: రాష్ట్ర జనాభాలో 11 శాతం ఉన్న ముదిరాజ్‌లకు అన్ని రాజకీయ పార్టీలు 11 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఓట్లు మావే- సీట్లు మావే అనే నినాదంతో ముందడుగు వేయాలని ముదిరాజ్ సామాజికవర్గానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం

2లో



## లక్ష్యం.. క్లీన్ స్వీప్

**నేడు విజయవాడలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం**

**రాష్ట్రవ్యాప్తంగా 8 వేల మందికిపైగా ప్రతినిధుల రాక**

**53 నెలల సుపరిపాలన ద్వారా చేసిన మంచిని వివరించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్**

**'విప్లవాత్మక సంస్కరణలు - సమగ్రాభివృద్ధి -మళ్లీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత'పై మార్గ నిర్దేశం**

**'రాష్ట్రానికి జగనే కావాలి' కార్యక్రమాన్ని చేపట్టాల్సిన తీరుపై దిశా నిర్దేశం**

అమరావతి: రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సన్నద్ధమయ్యారు. అందులో భాగంగా సోమువారం విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా పార్టీ అధ్యక్షుల నుంచి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షుల వరకు 8 వేల మందికిపైగా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు.

2లో

# దారుణ మారణకాండ

## 1100 మందికి పైగా మృతి

- యుద్ధాన్ని ప్రకటించిన ఇజ్రాయెల్ భద్రతామండలి
- యుద్ధరంగంలోకి అగ్రరాజ్యం అమెరికా
- ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్ తరలింపు
- రూ.66 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటన
- నేటి నుంచి తీవ్రతరం కానున్న పోరు!
- సరిహద్దుల్లో పౌరుల్ని ఖాళీచేయిస్తున్న ఇజ్రాయెల్
- ఇజ్రాయెల్‌లో 700కు పైగా మరణాలు
- 10 మంది నేపాలీ విద్యార్థుల దుర్మరణం
- గాజాలో భవంతుల పేల్చివేత.. 400 మంది మృతి
- వేల మందికి గాయాలు.. వెల్లడించని హమాస్‌లు
- హమాస్‌లకు మద్దతుగా హిజ్బుల్లా ఉగ్ర సంస్థ
- లెబనాన్ నుంచి రాకెట్‌లతో వరుస దాడులు
- దీటుగా ఎదుర్కొన్న ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్



జెరూసలేం, అక్టోబరు 8: ఇజ్రాయెల్-పాలస్తీనాల యుద్ధం ఉధృతంగా మారింది. శనివారం ఉదయం నుంచి పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హరాకత్ అల్-ముక్వామా అల్-ఇస్లామియా(హమాస్) సుమారు ఏడువేల రాకెట్లతో ముప్పేట దాడికి దిగగా.. ప్రతిదాడిని ప్రారంభించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస(ఐడీఎఫ్) ఆదివారం యుద్ధం తీవ్రతను పెంచింది. సోమవారం నుంచి మరింత దూకుడుగా వ్యవహరించేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు జరిగిన పోరులో ఇరువైపులా వెయ్యిమందికి పైగా మరణించగా.. వారిలో సాధారణ పౌరుల సంఖ్యనే అధికంగా ఉంది. హమాస్ దాడి నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహు అధ్యక్షతన ఆదివారం భద్రతామండలి భేటీ జరిగింది. ఈ భేటీలో.. హమాస్ చర్యను తీవ్రంగా ఖండించిన మంత్రులు, అధికారులు.. యుద్ధానికి ఆమోదం తెలిపారు. దాంతో.. సోమవారం నుంచి ఇజ్రాయెల్ దుందుడుకుగా వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే గాజాస్ట్రిప-ఇజ్రాయెల్ సరిహద్దుల్లోని ఖఫర్ అజా, నహల్‌ఓజ్, అల్యూమిక్, సాద్‌లో ఉన్న పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. సరిహద్దు వెంబడి కీలక ప్రాంతాల్లో హమాసలు, ఐడీఎఫ్ మధ్య పోరు కొనసాగుతోంది. ఇజ్రాయెల్ అంతర్గత భద్రత చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం.. పరిస్థితులను శనివారం

2లో

# 70 సీట్లకు ఓకే!

న్యూఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ఓ కొలిక్కి తెచ్చింది. రాజకీయ అనుభవం, కుల సమీకరణాలు, ఆర్థిక పరిస్థితులు, సర్వేలను బేరీజు వేసుకుంటూ దాదాపు 70 స్థానాల్లో అభ్యర్థులను కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఖరారు చేసింది. కమిటీ సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరని మిగతా సీట్లకు అభ్యర్థుల ఎంపికపై మరో సారి భేటీ అయి చర్చించాలని నిర్ణయించింది. ఏకాభిప్రాయం రాని స్థానాలకు ఇద్దరు చొప్పున పేర్లతో జాబితా సిద్ధం చేసి పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)కి పంపాలని.. వారు ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా పేర్లను ఖరారు చేయాల ని తీర్మానించింది. ఇప్పటికే ఒక్కో పేరును ఖరారు చేసిన నియోజకవర్గాల జాబితాకు సీఈసీ అను మతి తీసుకుని విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నెల 14 తర్వాత సీఈసీ భేటీ అయి అభ్యర్థుల జాబితాలను పరిశీలించనుందని.. ఈ నేపథ్యంలో ఈ నెల 16న లేక 18న తొలి జాబితాను విడుదల చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అయితే ఈ నెల 15 నుంచి ముఖ్య నేతలతో బస్సు యాత్ర చేపట్టాలని టీపీసీసీ నిర్ణయించడంతో.. ఆ బస్సు యాత్ర పూర్తయ్యాక అభ్యర్థుల జాబితాను ప్రకటించే ఆలోచన కూడా ఉందని అంటున్నాయి.

# 10న ఆదిలాబాద్‌లో అమిత్ షా సభ

(మొదటి పేజీ తరువాయి)

అయింది. దీనికి బదులు సికింద్రాబాద్ సిఖ్ విలేజీలోని ఇంపీరియల్ గార్డెన్‌లో జరిగే మేధావుల సదస్సులో అమిత్ షా పాల్గొనున్నారు. మేధావుల సదస్సు సక్సెస్‌పై ఆదివారం సాయంత్రం బీజేపీ కార్యాలయంలో లీగల్ సెల్‌తోపాటు ఇతర మేధావులతో కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. సదస్సుకు అన్ని వర్గాల మేధావులను ఆహ్వానించి మేనిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలపై వారి నుంచి బీజేపీ సలహాలు తీసుకోనుంది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో ఆదిలాబాద్ సభలో అమిత్ షా వివ రిస్తారని అన్నారు. కేసీఆర్‌కు హఠావో, బీజేపీకో జీతావో.. తెలంగాణకో బచావో... అనేదే బీజేపీ నినాదామని చెప్పారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను ఎందుకు దగ్ధం చేస్తున్నారో కాంగ్రెస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'రాష్ట్రాభివృద్ధి కోసం రూ.9 లక్షల కోట్లు ఇచ్చినందుకా, ఇటీవల రాష్ట్రానికి పసుపుబోర్డు, గిరిజన వర్సిటీ వంటివి ప్రకటించినందుకా, కృష్ణానదీలో తెలంగాణ నీటి వాటా ఖరారుకు ట్రిబ్యునల్ వేసినందుకా.. మోదీ దిష్టిబో మ్మలు దగ్ధం చేస్తున్నారు'అని నిలదీశారు.

# రాష్ట్రంలో మరణ మృదంగం!

(మొదటి పేజీ తరువాయి)

వాళ్లదే. అమ్మే వాళ్లూ వాళ్లే. ప్రధాని డిజిటల్ ఇండియా అంటుంటే వైసీపీ ప్రభుత్వం మాత్రం ఓన్లీ క్యాష్ అంటోంది. మద్యం షాపుల్లో నగదు ఇస్తే తప్ప మద్యం ఇవ్వరు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు స్వయంగా ఒక షాపులో అమ్మకాలు ఎంత జరిగాయో... అందులో నగదు అమ్మకాలు ఎంత జరిగాయో లెక్కలు తీసి చూశారు. అమ్మకాలన్నీ లెక్కల్లో చూపించకుండా ఏటా రూ.7,000 కోట్లు దోపిడీ చేస్తున్నారు. ఇంత దారుణమైన దోపిడీకి, అవినీతికి ఇక్కడ ఎందుకు కేసులు లేవు? ఈ బహిరంగ అవినీతిపై ఢిల్లీలో మాదిరిగా ఇక్కడ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పోరాడాలని మా విజ్ఞప్తి" అని అన్నారు. "గత ప్రభుత్వాల హయాంలో మద్యం షాపుల్లో నాణ్యమైన బ్రాండ్ల అమ్మకాలు జరిగేవి. అంతర్జాతీయ బ్రాండ్లు కూడా దొరికేవి. ఇప్పుడు వైసీపీ నేతల డిస్టిలరీల్లో తయారైన నాసి రకం మద్యం మాత్రమే దొరుకుతోంది. ఈ మద్యం బ్రాండ్లతో నాడీ వ్యవస్థను విచ్ఛిన్నం చేసి, ఆరోగ్యాన్ని దెబ్బ తీసే విష రసాయనాలు ఉన్నాయని చెన్నైలోని ఎస్‌జీఎస్ ల్యాబ్ అధికారికంగా ధృవీకరించింది. రాష్ట్రం నలుమూలలా ప్రభుత్వ ఆస్పత్రులకు పేదలు నిత్యం వందల సంఖ్యలో ఈ మద్యంతో ఆరోగ్యం నాశనమై చికిత్స కోసం వస్తున్నారు. ప్రతి జిల్లాలో వందల మంది చనిపోయారు. విశాఖ కేజీహెచ్‌లో ఒక ఏడాది కాలంలో ఉదర కోశ విభాగంలో 1,000 మంది చేరితే అందులో సగం మంది మద్యం తాగి ఆరోగ్యం నాశనమైన వాళ్లే. అక్కడ ఒక్క చోటే ఆ ఒక్క ఆస్పత్రికి చికిత్సకు వచ్చిన వారిలో ఒక ఏడాది కాలంలో 36 మంది చనిపోయారు. మిగిలిన ఆస్పత్రుల లెక్కలు, అసలు ఆస్పత్రులకు రాకుండా ఆర్ఎంపీల చికిత్సలతో ఇళ్ల వద్దే పోయిన వారి లెక్కలు తీస్తే రాష్ట్రం మొత్తంలో వేల సంఖ్యలో ఉంటారు. కేవలం నాసి రకం మద్యంతో మరణ మృదంగం మోగుతోంది" అని ఆరోపించారు. తరచూ మద్యం తాగే అలవాటు ఉన్నా కాలేయం దెబ్బ తినడానికి పది నుంచి పదిహేనేళ్లు పడుతుందని, కాని ఇప్పుడు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్ముతున్న నాసి రకం మద్యం తాగిన వారికి చాలా త్వరగా కాలేయం పాడై పోతోందని ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు.

# ఉదయ్‌పూర్ డిక్లరేషన్ అమలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చేయండి. ఓయూ విద్యార్థులకు మూడు స్థానాలు కేటాయించండి. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు టికెట్లు ఇవ్వండి" అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. రాహుల్, సోనియాగాంధీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. దీంతో విషయం తెలుసుకున్న సీడబ్ల్యూసీ సభ్యుడు జితేంద్రసింగ్.. వారి వద్దకు వచ్చి నచ్చజెప్పి శాంతింపజేశారు. అనంతరం జితేంద్రసింగ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను వంద శాతం కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీతోపాటు ఇండియా కూటమి జాతీయ ఎజెండా అని తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావాలని రాహుల్‌గాంధీతోపాటు కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందన్నారు. చాలా రాష్ట్రాలలో ఎన్నికల ప్రక్రియ జరుగుతోందని, అందులో యువత, విద్యార్థి, ఓబీసీ, మహిళలు ఉన్నారని, వారికి టికెట్లు దక్కుతాయని అన్నారు. విద్యార్థి నేతలు నిరసన తెలపలేదని, వారి అభిప్రాయం మాత్రమే చెప్పారని పేర్కొన్నారు. విద్యార్థి నేతలకు టికెట్లు ఇవ్వాలనే విషయంపైనా చర్చలు జరుగుతున్నాయని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోరారు. వారి అభ్యర్థనలను స్క్రీనింగ్ కమిటీకి, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేకు, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి అందజేస్తానన్నారు. అనంతరం ఓయూ జేఏసీ నేతలు కోటూరి మానవతారాయ్ (సత్తుపల్లి), కైలాష్ నేత (మునుగోడు), దుర్గం భాస్కర్ (చెన్నూరు), బాలలక్ష్మి (జనగామ), కుర్వ విజయ్ (గద్వాల), కేతూరి వెంకటేశ్ (కొల్లాపూర్), రాజిరెడ్డి (బాన్సువాడ) తదితరులు జితేంద్రసింగ్‌కు అభ్యర్థనలు అందజేశారు.

# బండి సంజయ్ కరీంనగర్ బరిలో!

**కోరుట్ల ఎమ్మెల్యేగా అర్వింద్ పోటీ?**

**మెదక్ అసెంబ్లీ బరిలో విజయశాంతి**

**50 మందితో బీజేపీ తొలి జాబితా?**

**15 లేదా 16న ప్రకటించే అవకాశం**



హైదరాబాద్, తెలంగాణ శాసన సభకు పోటీ చేయబోయే బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాను ఈ నెల 16న ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను పలు సెగ్మెంట్లలో బరిలో నిలిచే కమలనాథుల ఎంపికకు సంబంధించి ఇప్పటికే పార్టీ నాయకత్వం కసరత్తును ముమ్మరం చేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎన్నికల కమిటీ అధ్యక్షుడు ప్రకాశ్ జావడేకర్.. రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్‌లు సునీల్ బన్సల్, తరుణ్ ఛుగ్.. ఎంపీలు లక్ష్మణ్, బండి సంజయ్.. ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్ శనివారం జాబితాపై చర్చించారు. దాదాపు 90 సెగ్మెంట్ల జాబితాపై చర్చించగా, ఇందులో, సుమారు 50 నియోజకవర్గాలకు సంబంధించి స్పష్టత వచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ జాబితాను 15 లేదా 16న ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ నేతలంతా పోటీ చేయాల్సిందే అని బీజేపీ జాతీయ నాయకత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. దీంతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, సోయం బాపురావు, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యు డు డాక్టర్ కె.లక్ష్మణ్‌లు బరిలోకి దిగక తప్పని పరిస్థితి ఏర్పడింది. బండి సంజయ్ కరీంనగర్ నుంచి పోటీ చేస్తారు. ధర్మపురి అర్వింద్ కోరుట్ల నుంచి బరిలో దిగే అవకాశం ఉంది. డాక్టర్ లక్ష్మణ్ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన బదులు పార్టీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి పేరు పరిశీలనలో ఉంది. ఈమెతో పాటు ప్రదీప్ కుమార్ కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు తనయుడు బరిలోకి దిగనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. విజయశాంతిని మెదక్ నుంచి పోటీ చేయించే ప్రతిపాదన పార్టీ జాతీయ నాయకత్వం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

సిర్పూర్ : పాల్వాయి హరీశ్‌బీ ఆసిఫాబాద్ : ఆత్మారావు నాయక్, కోట్నాక్ విజయ్‌బీ చెన్నూరు : వివేక్‌బీ బెల్లంపల్లి : శ్రీదేవిబీ మంచిర్యాల : రఘునాథరావుబీ ఆదిలాబాద్ : పాయల శంకర్, సుహాసినిరెడ్డిబీ బోథ్ : సోయం వెంకటేశ్వర్లు, సాకేటి దశరథ్‌బీ నిర్మల్ : మహేశ్వర్‌రెడ్డిబీ ముథోల్: డాక్టర్ రమాదేవి, రామారావు పాటిల్‌బీ ఖానాపూర్ : రమేశ్ రాథోడ్‌బీ బాన్సువాడ : మల్యాద్రిరెడ్డిబీ ఆర్మూరు : ధర్మపురి అర్వింద్, రాకేశ్‌రెడ్డిబీ బోధన్: మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డిబీ నిజామాబాద్ అర్బన్: యెండల లక్ష్మీ నారాయణ, ధన్‌పాల్ సూర్యనారాయణబీ నిజామాబాద్ రూరల్: దినేశ్ కులాచారి, బస్వా లక్ష్మీ నారాయణబీ బాల్కొండ: అన్నపూర్ణమ్మ లేదా ఆమెతనయుడు

# ముదిరాజ్‌లకు 11 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన ముదిరాజ్ ఆత్మగౌరవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఈటల కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నో ఏళ్లుగా ముదిరాజ్‌లకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా శాసనసభల్లో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారు ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఉండటం ఇందుకు నిదర్శనం అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముదిరాజ్‌లకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని, ముదిరాజ్‌ల ఆత్మగౌరవంపై దెబ్బ కొట్టిందని మండిపడ్డారు. ముదిరాజ్‌లు తెలంగాణ కోసం పోరాడిన వ్యక్తులు కాదా ? అని ప్రశ్నించారు. ముదిరాజ్‌లపై నమ్మకం లేని పార్టీకి ఓటు ఎందుకు వెయ్యాలని అడిగారు. చేపపిల్లల పంపిణీ పేరిట ప్రభుత్వం రూ.500 కోట్లు ఇస్తుందని, కానీ డబ్బులిస్తే తామే చేప పిల్లలు కొనుగోలు చేసుకుంటామని పేర్కొన్నారు. ప్రాజెక్టులు, చెరువులపై మత్స్యకారులకు సంపూర్ణ అధికారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ దళితులకు ద్రోహం చేశారని మండిపడ్డారు. చేప పిల్లల కోసం ప్రభుత్వానికి జేజేలు కొడితే జీవితాలు మారవని హెచ్చరించారు. ఇక, ముదిరాజ్ ఆత్మగౌరవ సభను అడ్డుకునేందుకు అధికార పార్టీ అనేక యత్నాలు చేసిందని ఈటల ఆరోపించారు. బారికేడ్లు పెట్టి, బస్సులు ఆపేసి, సభా స్థలం నిండిపోయిందని చెప్పి సభకు వస్తున్న ముదిరాజ్ బిడ్డలను అడ్డుకున్నారని చెప్పారు. సభకు అనుమతి లేదని, ఇది ముదిరాజ్‌ల సభ కాదని సోషల్ మీడియాలోనూ దుష్ప్రచారం చేశారని చెబుతూ తీవ్ర పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు వెళ్తే ప్రభుత్వ పథకాలు ఆపేస్తారని బెదిరించారని అన్నారు. సభ అయిపోయిందంటూ పోలీసులే కొంతమందిని అడ్డుకున్నారని ఆరోపించారు. రాష్ట్రం నలుమూలల నుంచి పావు వంతు మాత్రమే ముదిరాజ్ సభకు వచ్చారని అన్నారు. తనకు నాలుగు కోట్ల మంది ఆదరణ ఉందని.. అలాంటి తనపైనే సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని ఈటల మండిపడ్డారు.

# దారుణ మారణకాండ

(మొదటి పేజీ తరువాయి)

'యుద్ధ స్థితి'గా పేర్కొన్న ప్రభుత్వం.. ఆదివారం యుద్ధాన్ని ప్రకటించడంతో.. సోమవారం నుంచి గాజాపై భీకర దాడులు ఉంటాయని స్పష్టమవుతోంది. సరిహద్దుల్లోని పౌరులను తరలించడం కూడా యుద్ధ వ్యూహంలో భాగమేనని తెలుస్తోంది. సరిహద్దుల్లో భారీ సంఖ్యలో యుద్ధ ట్యాంకులను, ఫైటర్‌జెట్లను మోహరించడంతో.. సోమవారం ఏదైనా జరగొచ్చని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాగా.. 1973 తర్వాత ఇజ్రాయెల్ రెండోసారి 'యుద్ధ స్థితి'ని ప్రకటించడం గమనార్హం..! గాజాస్ట్రిప-ఇజ్రాయెల్ సరిహద్దుల్లో 16 చోట్ల హమాస్ ఉగ్రవాదులకు, తమకు మధ్య భీకర పోరు సాగుతున్నట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస(ఐడీఎఫ్) ఆదివారం మధ్యాహ్నం వెల్లడించింది. ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డేనియల్ హగారీ మీడియాతో మాట్లాడుతూ ఇజ్రాయెల్‌లో నక్కిన హమాస్ ఉగ్రవాదులను చాలా వరకు మట్టుబెట్టినట్లు తెలిపారు. పదుల సంఖ్యలో ఉగ్రవాదులను సజీవంగా పట్టుకున్నామని పేర్కొన్నారు. "సరిహద్దు గ్రామాలు, పట్టణాల్లో ఇంకా ఉగ్రవాదుల కోసం వేట సాగుతోంది. ఓఫకిమ్, సదెరాత్, యాద్‌మోర్దేచాయ్, కిఫర్ అజా, బీరీ, యాతిద్, కిసుఫిమ్‌లో ఉగ్రవాదులతో మా సేనలు భీకరంగా పోరాడుతున్నాయి. ఇజ్రాయెల్ వ్యాప్తంగా అన్ని నగరాల్లో ఐడీఎఫ్ మోహరించింది" అని ఆయన వివరించారు. కాగా.. హమాస్ దాడుల్లో శని, ఆదివారాల్లో తమ పౌరులు, అధికారులు 700 మంది వరకు మృతిచెందినట్లు, 2 వేల మందికి పైగా గాయడ్డట్లు ప్రభుత్వం ప్రకటించింది. మృతుల్లో 10మంది నేపాలీలు ఉన్నట్లు ఇజ్రాయెల్‌లోని నేపాల్ రాయబార కార్యాలయం ప్రకటించింది. ఇజ్రాయెల్‌కు చెందిన 45 మంది అమర సైనికులు, అధికారుల ఫొటోలు, పేర్లను ఐడీఎఫ్ వెల్లడించింది. ఈ రెండ్రోజుల్లో 2 వేల మందికి పైగా క్షతగాత్రులయ్యారని, వారిలో రెండొందల మంది పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. మరోవైపు గాజాస్ట్రిపలోని ఓ మసీదు నుంచి ఇజ్రాయెల్‌కు భారీ భూగర్భ సొరంగం ఉన్నట్లు గుర్తించి, దాన్ని ధ్వంసం చేసినట్లు సైన్యం ప్రకటించింది. అటు జికిమ్ బీచ్ వద్ద హమాసలకు చెందిన ఐదు నౌకలను పేల్చేశామని, చొరబాటుకు యత్నించిన ఏడుగురు ఉగ్రవాదులను నిర్బంధించామని పేర్కొంది. ఇజ్రాయెల్ ప్రతిదాడితో గాజా గజగజలాడుతోంది. గైడెడ్ మిసైల్స్, రాకెట్ దాడులతో గాజాలోని భవంతులు పేకమేడల్లా కూలిపోతున్నాయి. శనివారం పాలస్తీనా టవర్ కుప్పకూలగా.. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు 810 లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఐడీఎఫ్ తెలిపింది. 13 ఆకాశహర్మ్యాలు, 30 భారీ భవనాలు, ఇతర బిల్డింగ్‌లు నేలకూలాయి. వీటిల్లో వతన్‌టవర్, అల్-అక్లొక్ టవర్, మాతర్ సముదాయం ఉన్నాయి. ఇజ్రాయెల్ దాడులతో 400 మంది పౌరులు మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖ పేర్కొంది. హమాసలకు మద్దతుగా గాజా స్ట్రిప్ నుంచి శనివారం సాయంత్రం ర్యాలీగా ఇజ్రాయెల్ వైపు వచ్చిన హిజ్బుల్లా ఉగ్రవాదులను ఐడీఎఫ్ మట్టుబెట్టింది. దీంతో.. హిజ్బుల్లా ఉగ్రవాదులు ఆదివారం ఉదయం లెబనాన్ భూభాగం నుంచి ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు చేశారు. తమ డిఫెన్స్ వ్యవస్థలు ఆ మిసైల్స్, రాకెట్స్‌ను సమర్థంగా ఎదుర్కోగలిగాయని ఐడీఎఫ్ వెల్లడించింది. ఇజ్రాయెల్‌కు వారంపాటు విమానాలను రద్దుచేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది.

# లక్ష్యం.. క్లీన్ స్వీప్

(మొదటి పేజీ తరువాయి)

గత 53 నెలలుగా సుపరిపాలన, సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ప్రతి ఇయిటికీ, గ్రామానికీ, నియోజకువర్గానికీ, జిల్లాకు, రాష్ట్రానికీ చేసిన మంచిని మరింత ప్రభావవంతంగా వివరించడం.. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న ఎక్కడికక్కడ తిప్పికొట్టడంపై ప్రతినిధులకు సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు. అధికారంలోకి వచ్చాక విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు పరిపాలన వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రం సమగ్రాభివృద్ధి దిశగా పరుగులెత్తిస్తున్న తీరును కళ్లకు కట్టినట్లుగా వివరించి.. ప్రగతిపథంలో రాష్ట్రం దూసుకెళ్లాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పాలని సూచించనున్నారు. ఇందుకు 'రాష్ట్రానికి జగనే కావాలి' (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని చేపట్టాల్సిన తీరుపై ప్రతినిధులకు మార్గ నిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులు సీఎం సందేశాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్తారు.

### దేశ చరిత్రలోనే కొత్త రికార్డు

సార్వత్రిక ఎన్నికల్లో 50 శాతం ఓట్లు, 151 శాసనసభ స్థానాలు, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తొలి ఏడాదే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేసి మేనిఫెస్టోకు సిసలైన నిర్వచనం ఇచ్చారు. ఇప్పటికే 99.5 శాతం హామీలు అమలు చేశాగరు. గత 53 నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా అర్హతే ప్రమాణికంగా అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.4.69 లక్షల కోట్ల ప్రయోజనం పేదలకు చేకూర్చారు. దేశ చరిత్రలో ఎన్నడూ ఈ స్థాయిలో పేదలకు లబ్ధి చేకూర్చిన దాఖలాలు లేవు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారు. వార్డు, గ్రామ సచివాలయాలు, జిల్లాల పునర్విభజన ద్వారా పరిపాలనను వికేంద్రీకరించి.. ప్రజల ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకెళ్లారు. పోర్టులు, షిప్పింగ్ యార్డులు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేశారు. దాంతో రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్తోంది. తద్వారా సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఆదరణ నానాటికీ పెరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాలు సాధించడంతో పాటు తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు శాసనభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో రికార్డు మెజార్టీతో విజయభేరి మోగించడం అందుకు నిదర్శనం.

### నిత్యం ప్రజలతో మమేకం

అధికారంలోకి వచ్చాక అనునిత్యం ప్రజలతో సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు, ప్రజాప్రతినిధులు మేమకమవుతున్నారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా చేసిన మంచిని ప్రతి ఇంటికీ వివరించడానికి 2022 మే 11న చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా చేసిన మేలును వివరించి.. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి ఈ ఏడాది ఏప్రిల్ 7 నుంచి 29 వరకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో 1.45 కోట్ల కుటుంబాలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మమేకమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'మెగా పీపుల్స్ సర్వే'లో 1.16 కోట్ల కుటుంబాల ప్రజలు అంటే 80 శాతం మంది ప్రభుత్వానికి మద్దతు ప్రకటించి.. 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ నినదించారు. ఇటీవల ప్రముఖ జాతీయ ఛానల్ టైమ్స్ నౌ నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 25కు 25 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని తేలడమే అందుకు నిదర్శనం. ప్రజల్లో అత్యంత సానుకూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో సమన్వయంతో పనిచేస్తే 175కు 175 స్థానాల్లో విజయం సాధించడం సాధ్యమేనని పార్టీ ప్రతినిధులకు సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే క్రమంలో సోమవారం పార్టీ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. నాలుగున్నరేళ్లలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లడం.. ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని ఎక్కడికక్కడ సమర్థవంతంగా తిప్పికొట్టి.. ప్రజల ఆశీర్వాదం కోరే దిశగా శ్రేణులకు పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తారని వివరించారు.

# స్వచ్ రిక్ష పంపిణీ




**ఎల్బీనగర్ అక్టోబర్ 8: సమ సమాజం:** భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో స్వచ్ రిక్ష కార్మికులకు రిక్షాలు నాణ్యత లేకపోవడంతో ఎస్.ఆర్.ఆర్ ఫౌండేషన్ సభ్యుల సహకారంతో డివిజన్లోని నేడు వివేకానంద నగర్ చౌరస్తా వద్ద గడ్డిఅన్నారం స్వచ్ భరత్ కన్వీనర్ బొమ్మరాజు రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ రిక్ష పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎస్.ఆర్.ఆర్ ఫౌండేషన్ అధినేత, బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ మాట్లాడుతూ కార్మికులకి రిక్ష సరైన నిర్వహణ లేకపోవడంతో తరచూ కాలనీవాసులనుండి ఫిర్యాదులు వస్తున్నాయి, కార్పొరేటర్ డిప్యూటీ కమిషనర్ కి ఎన్నోసార్లు వారి దృష్టికి తీసుకొని వెళ్ళిన ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. శానిటేషన్ మొత్తం కూడా పడికేసింది అన్ని అన్నారు. రిక్షాలే కాకుండా ఇయ్యాల్సినటువంటి చీపిరి కట్టలు పనిముట్లు సరైన గా లేవు మరి వాళ్ళు ఎట్లా చేస్తారు అని మండిపడ్డారు. జి.హెచ్.ఎం.సి ఉన్నటువంటి అన్ని డివిజన్లో ఇదే పరిస్థితి అన్ని తెలియజేశారు. స్వచ్ రిక్ష కార్మికులకు సహకరించి రిక్షాలను కల్పించిన సామ రంగా రెడ్డి ఫౌండేషన్ సభ్యులకి కార్పొరేటర్ ప్రతేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా సామ రంగరెడ్డి మాట్లాడుతూ జి.హెచ్.ఎం.సిలో గత నాలుగు సంవత్సరాలుగా స్వచ్ రిక్షాలు పాడైపోయి రోడ్లపై చెత్త ఎత్త లేని దుస్థితి రిక్షా కార్మికులు కానీ తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అలాగే గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్ ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళిన ఎటువంటి చర్యలు తీసుకోపోవడంతో సామ రంగా రెడ్డి ని కోరడంతో నరేంద్ర మోడీ ఆశ సాధనకై స్వచ్ఛత హుయ్ సేవ కార్యక్రమంలో భాగంగా నేడు నూతన స్వచ్ఛ రిక్షాలను జిహెచ్ఎంసి కార్మికులకు వివిధ కాలనీ వాసుల సమీక్షంలో పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ ఒక బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితి చాలా దారుణంగా తయారవుతుందని అన్నారు. ఒకపక్క గత ఫిబ్రవరి నుండి ఎటువంటి కాంట్రాక్టర్లకు బిల్లులను చెల్లించలేక పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. ఎన్నికలు రావడంతో స్థానిక శాసనసభ్యులు మళ్లీ ఓట్ల కోసం మోస పూడిత మాటలతో మీ ముందుకు వస్తున్నారని చెప్పి ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రజలు నమ్మొద్దని ఒకసారి భారతీయ జనతా పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జి.హెచ్.ఎం.సి జవాన్ యాదగిరి , ఎస్.ఎఫ్.ఐ యాకయ్య , శ్రీనివాస్ రెడ్డి , సంజీవ రెడ్డి , పందు , గౌతమ్ నగర్ కాలనీ అధ్యక్షులు కళ్లెం మధుసూదన్ రెడ్డి మరియు బీజేపీ నాయకులు చిలకూరి రామ రెడ్డి , ఓంకార్ , మురళి , లక్ష్మి దేవి , వెంకటేష్ చారీ , అనిల్ , రాజేశ్వరి , దయాకర్ , సందీప్ , శివ రామ , వెంకట్ రెడ్డి . తదితరులు పాల్గొన్నారు.

# అనుమానంతో తన భార్యను చంపిన వ్యక్తి అరెస్ట్





**ఎల్బీనగర్ అక్టోబర్ 8: సమ సమాజం:** తేదీ 06.10.2023 నాడు, కుమారి రమ్య D/o కోటేశ్వరరావు, నుండి వ్రాతపూర్వక ఫిర్యాదు ఏమనగా తన అక్క అయిన శ్రీమతి తన్నీరు శాలిని వయస్సు 32 సంవత్సరాలుకి బాలకోటయ్య తో 2008 లో వివాహం జరిపించినారు, వారికి ఇద్దరు కుమారులు ఈశ్వర్ 8%ష్ట్ర% క్లాస్, శివ కార్తీక్ 7 క్లాస్, వీరు ప్లాట్. నెం. 379, వీరు కుటుంబంతో సహా ఇంజాపూర్ గ్రామపంచాయతీలో అంజనాపురికాలనీలో నివాసం ఉండేవారు. భార్యభర్తల మధ్య కుటుంబ కలహాలతో తరచుగా గొడవలు జరుగుతుండేవారు. ఇట్టి గొడవలను ఇరువర్గాల పెద్ద మనుషుల సమక్షంలో మంచిగా ఉండమని సర్ది చెప్పినారు. నిందితుడు అయిన బాలకోటయ్య ఎప్పుడు గొడవ పడుతూవుండి తన భార్య షాలినిని బాగా కొట్టి హింసించేవాడు. తన భర్తతో వేగలేక గత జూలై నెలలో శాలిని తన ఇద్దరు కుమారులతో కలిసి వనస్థలిపురం శతవాహననగర్ లోని వాళ్ళ అమ్మ నాన్నల దగ్గరికి వచ్చి వారి దగ్గరనే ఉంటూ వాళ్ళ ఇద్దరు పిల్లలను చదివించు కొనుచున్నది. ఈ విషయంలో బాలకోటయ్య భార్యపై బాగా కోపం పెంచుకొని నన్ను దూరం పెట్టి మరియు తన దగ్గరకు రానీయకుండా ఆస్తులు అన్ని ఆమె పేరు మీదనే రిజిస్ట్రేషన్ చేసుకుని ఉన్నది. మరియు ఆమెపై అనుమానం పెంచుకొని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకొన్నాడు. అయితే గత పది రోజుల క్రితం శాలిని తల్లిదండ్రులు వారి సొంతవురికి వెళ్ళినారు బాలకోటయ్య ఇదే అదునుగా భావించి తేదీ 06.10.2023 నాడు సాయింత్రం తన్నీరు శాలిని తన స్కూటీపై అంజనాపురి కాలనీలోని వాళ్ళ ఇంటికి వెళ్లి ఇల్లు శుభ్రపరచి తిరిగి వస్తుండగా విజయపురి కాలనీలోని సాయిబాబా గుడి వద్దకు చేరుకోగానే, బాలకోటయ్య తన భార్య శాలిని యొక్క స్కూటీని అడ్డగించి ఆమే క్రింద పడగానే పక్కనే ఉన్న బండ రాయితో ఆమె తలపై బలంగా మోది చంపినాడని ఫిర్యాదు రాగా వనస్థలిపురం ఇన్స్పెక్టర్ జలందర్ రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, ముద్దాయి కోసం మూడు బృందాలను ఏర్పాటు చేసినారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈరోజు అనగా తేదీ 08.10.2023 నాడు ఉదయం 6 గంటల సమయంలో సూర్యపేట టౌన్ బస్ స్టాప్ నందు వనస్థలిపురం పోలీస్ వారు ముద్దాయి అయినా బాలకోటయ్యను అదుపులోనికి తీసుకొనినారు. తదుపరి అతనిని పిఎస్ కు తీసుకొని వచ్చి విచారించగా సదరరు ముద్దాయి అయిన బాలకోటయ్య తాను చేసిన నేరంను ఒప్పుకొన్నాడు. మృతురాలు ఆస్తి అంతయు తన పేరు మీదనే రిజిస్ట్రేషన్ చేసుకుని ముద్దాయిని దూరం పెడుతూ, ఇతరులతో సన్నిహితంగా ఉంటుందని తన భార్యపై అనుమానము పెంచుకొని, తన భార్యపై కోపంతో ఎప్పుడూ గొడవపడుతూ ఉండేవాడు. తనకి ఎన్ని సార్లు చెప్పిన వినకుండా అలాగే చేస్తుందని, తన భార్యలో ఎలాంటి మార్పు రాదని అందుకు తనను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకుని, ముందుగా తన ప్లాన్ లో భాగంగా తన అత్తమామలు వారి సొంతురికి వెళ్ళినరాని తెలుసుకొని తన భార్య తేదీ 06.10.2023 నాడు సాయింత్రం ఇల్లు శుబ్రమ్ చేయుటకు గాను అంజనపురి కాలనీలోని వారి ఇంటికి వచ్చి తిరిగి వెలితుందని తెలుసుకొని తనను చంపడానికి ఇదే సరియైన సమయం అని భావించినాడు. కానీ అతని వద్ద ద్విచక్రవాహనం లేకపోవడంతో తన తమ్ముడు దగ్గర ద్విచక్రవాహనం (స్కూటీ) తీసుకొని రోడ్డు పైన తన భార్యను గమనిస్తూ వల్ల ఇంటివరకు (శాతవాహన నగర్) వెళ్ళగా తాను కనిపించలేదు. తిరిగి వస్తుండగా విజయపురి కాలనీ సాయిబాబా గుడి వెనకాల శాతవాహన నగర్ రోడ్డు 5 వద్దకు రాగానే తనకు ఎదురుగా తన భార్య స్కూటీ పై వస్తుండగా, తన టూవిల్లర్ స్కూటీ తో బాలకోటయ్య తన భార్యను అడ్డగించిగా ఆమె క్రింద పడిపొగ పక్కనే ఉన్న పెద్ద బండ రాయితో తలపై కొట్టినాడు కానీ ఆమె అటుఇటు కదులుతుండగా మరలా అదే రాయితో మరలా కొట్టి చనిపోయిందని నిర్ధారించుకొని కాలనీ వాళ్ళు వస్తుండటం గమనించి తన టూవిల్లర్ స్కూటీ పై పారిపోయినాడు. తదుపరి అట్టి స్కూటిని పుల్లారెడ్డి స్వీట్ హౌస్ హయత్నగర్ వద్ద వదిలిపెట్టి విజయవాడ పారిపోయినాడు.

# అభివృద్ధికి ప్రాథమిక విలువలే పునాదిగా తెలంగాణ పల్లెల పునర్నిర్మాణం

**వికారాబాద్ ఎమ్మెల్యే "డాక్టర్ మెతుకు ఆనంద్"**



**వికారాబాద్ అక్టోబర్ 8 : సమ సమాజం:** ఆదివారం వికారాబాద్ జిల్లా, బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే "డాక్టర్ మెతుకు ఆనంద్" ధారూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో 2.20 కోట్లు నిధులతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఎబ్బనూరు గ్రామంలో 20 లక్షల నిధులతో నూతనంగా వేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. చింతకుంట గ్రామంలో 15 లక్షల నిధులతో వేసిన నూతన సీసీ రోడ్లను మరియు 5 లక్షల నిధులతో నూతనంగా వేసిన ఫార్మేషన్ రోడ్డును ప్రారంభించారు. హరిదాస్ పల్లిలో 11 లక్షల నిధులతో మంజూరు చేసిన %గ్రామాజా% నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కుక్కింద గ్రామంలో 9 లక్షల నిధులతో మంజూరు చేసిన అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నర్సాపూర్ గ్రామంలో 15 లక్షల నిధులతో నూతనంగా వేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గడ్డమీది గంగారం గ్రామంలో 17.50 లక్షల నిధులతో నూతనంగా వేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అల్లాపూర్ గ్రామంలో 15 లక్షల నిధులతో నూతనంగా వేసిన సీసీ రోడ్లను ప్రారంభించి, 20 లక్షల నిధులతో మంజూరు చేసిన గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ధారూర్ మండల కేంద్రంలో 5 లక్షల నిధులతో ఈద్గా కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంపల్లి గ్రామంలో 20 లక్షల నిధులతో మంజూరు చేసిన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కుమ్మరిపల్లి గ్రామంలో 20 లక్షల నిధులతో మంజూరు చేసిన నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మైలారం గ్రామంలో 20 లక్షల నిధులతో మంజూరు చేసిన నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తరిగొపుల గ్రామంలో 7.50 లక్షల నిధులతో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. నాగ్ సన్ పల్లి గ్రామంలో 20 లక్షల నిధులతో మంజూరు చేసిన నూతన గ్రామపంచాయతీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం తరిగోపుల గ్రామంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా ఎడ్ల రఘుమారెడ్డి నియామకం



**చౌటుప్పల్ అక్టోబర్ 8 : సమ సమాజం:** మండలం లోని శేరిల్ల గ్రామానికి చెందిన ఎడ్ల రఘుమా రెడ్డి ను యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బర్రె నరేష్ ఆదివారం నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఎడ్ల రఘుమా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ ఆదేశాలను పాటిస్తూ, యువతను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షింప చేయడానికి నిరంతరం పని చేస్తా నన్నారు. టి పి సి సి ప్రధాన కార్యదర్శి, మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జి చలమల్ల కృష్ణారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డికి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జ్ చలమల్ల కృష్ణారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బర్రె నరేష్, రాజీవ్ ట్రస్ట్ చైర్మన్ రావుల మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మండల అధ్యక్షులు బోయ దేవేందర్, చౌటుప్పల్ మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల మండల అధ్యక్షులకు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అల్పాహారం, తేనేటి విందులకు హాజరైన అందెల శ్రీరాములు యాదవ్



**ఎల్బీనగర్ అక్టోబర్ 8 :సమ సమాజం:** సరూర్నగర్ డివిజన్లోని క్రాంతి నగర్ కాలనీ, సాయి కృష్ణ నగర్ కాలనీ వాసుల పిలుపుమేరకు అసోసియేషన్ అధ్యక్షులు స్వామి రావు ఆధ్వర్యంలో అల్పాహారం మరియు తేనేటి విందుకు హాజరైన మహేశ్వరం అసెంబ్లీ 2018 బిజెపి ఎమ్మెల్యే కాంటెస్ట్ అభ్యర్థి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, నియోజకవర్గ సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ధీరజ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు బాణాల ప్రవీణ్, డివిజన్ బిజెపి అధ్యక్షులు సిద్దు ముదిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా చైతన్య యాత్రను చూసి బిఆర్ఎస్ బిజెపి పార్టీలకు వణుకు పుడుతుంది

**ఏనుగు రవీందర్ రెడ్డి**



**చౌటుప్పల్ అక్టోబర్ 8 సమ సమాజం::** మునుగోడు నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ ప్రజా చైతన్య యాత్రకు ప్రజల ఆదరణ చూసి బిజెపి, బీఆర్ఎస్ పార్టీలకు వణుకు పుడుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం చలమల్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండలంలో ప్రజా చైతన్య యాత్రను ప్రారంభించారు. యాత్రలో పాల్గొన్న ఏనుగు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ మోసపూరిత కుట్రలను ప్రజలు గుర్తించారన్నారు. ఎన్నికల సమయంలో ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలు నమ్మరని బిఆర్ఎస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే సంక్షేమ పథకాలను పక్షపాతం లేకుండా పార్టీలకతీతంగా అందజేయాలన్నారు. మునుగోడు లో చలమల కృష్ణారెడ్డికి ఏర్పడిన ఆదరణ చూసి బిజెపి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు స్కీములను కచ్చితంగా అమలు చేసి తీరుతామని తెలిపారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీ స్కీములతో కూడిన అభయహస్తం కరపత్రాన్ని ప్రజలకు అందజేయడం జరిగింది.

# నిరుపేద కుటుంబానికి బీసీ బంధు అందజేసిన ఎంపిటిసి



**గూడూరు అక్టోబర్ 8 : సమ సమాజం:** గూడూరు టౌన్ లో స్థానిక ఎంపిటిసి నూకల రాధిక సురేందర్ చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిన బీసీ బంద్ పథకం నిరుపేద కుటుంబానికి చెందిన తంగళ్ళపల్లి సురేష్ కు అందజేయడం జరిగింది. తంగళ్ళపల్లి సురేష్ మహబూబాబాద్ ఎమ్మెల్యే భానోత్ శంకర్ నాయక్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కి రుణపడి ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు స్థానిక ఎంపిటిసి ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్ యాదవ్, సీనియర్ నాయకులు వల్లప్ప శ్రీనివాస్, గూడూరు మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడ ఎల్లయ్య, టౌన్ యూత్ అధ్యక్షులు నూకల అశోక్ యాదవ్, సీనియర్ నాయకుడు ఎలమందల సారంగం, రైతు కోఆర్డినేటర్ నూకల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నాన్- షెడ్యూల్ ఆదివాసి గ్రామాలను ఐదవ షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించాలి

**గూడూరు అక్టోబర్ 8 : సమ సమాజం:** గూడూరు మండల ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కొల్లాపురం గ్రామంలో సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూణెం శ్రీనివాస్ మాట్లాడుతూ గూడూరు మండలంలో కొల్లాపురం బొద్దుగొండ జగన్ నాయకులగూడెం మొదలగు గ్రామాలను 5షెడ్యూల్లో గ్రామాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతంలో సుమారుగా 276 రెవెన్యూ గ్రామాలకు షెడ్యూల్ ప్రాంతాలుగా గుర్తించాలని అప్పటి ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చినారు వాటిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలతో కూడిన వంటి ఆదివాసి గ్రామాల్లో ఆదివాసులకు విద్యా ఉద్యోగం ఉపాధి రంగాలలో అవకాశాలు దొరకక వారి జీవితాలు చిన్న భిన్నం అవుతున్నాయని ఈ యొక్క గ్రామాల పైన ఐటీడీఏ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఈరోజు ఆదివాసి సమాజం అంతరించి పోతుందని ఆవేదన చెందారు ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాన్ షెడ్యూల్ ఆదివాసి గ్రామాలకు షెడ్యూల్ గ్రామాల్లో కలిపే ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు దానసరి రాజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు తాటి సుధాకర్, జిల్లా కార్యదర్శి దారం నరేష్, రాష్ట్ర కార్యదర్శి సోలం సాగర్, మండల అధ్యక్షుడు దారం సాంబరాజు, కొల్లాపురం గ్రామ దొర కారం లక్ష్మయ్య, పటేల్ పెనక రాములు, ఈసం హరీష్ తదితరులు పాల్గొన్నారు.





# పతక కీర్తి 'పారిస్'కిదే స్ఫూర్తి


ఆసియాడ్‌లో 107 పతకాలతో అదరగొట్టిన భారత్.. దేశ క్రీడా చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో మన అథ్లెట్లు రెండంకెల సంఖ్యలో పతకాలు కొల్లగొడతారనే ఆశలు రేపింది. 19వ ఆసియాడ్‌లో 660 మంది అథ్లెట్ల బృందం 28 స్వర్ణ, 38 రజత, 41 కాంస్య పతకాలు సాధించింది. 2018 జకర్తా క్రీడల్లో సాధించిన 70 పతకాలతో కంటే 37 మెడల్స్ అదనంగా దక్కించుకొంది. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో అంచనాలకు మించి రాణించగా.. ఆర్చరీ, షూటింగ్‌లో ఆధిపత్యం ప్రదర్శించారు. భారత్ నాలుగో స్థానంతో ఉత్తమంగా రాణించడం వెనుక మన ఆటగాళ్ల కృషి, పట్టుదల ఎంతో ఉంది. వీరిలో తొలిసారి పాల్గొన్న వారే ఎక్కువ మంది కావడం విశేషం. గత క్రీడల్లో ఎనిమిదో స్థానానికే పరిమితమైన మనం.. ఈమారు నాలుగో ర్యాంక్‌కు ఎగబాకాం. ఈ క్రీడల్లో భారత్ వంద పతకాలు సాధించగలదా అన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ మనోళ్లు అద్భుత ప్రదర్శన చూపారు. ఆసియాడ్‌లో మనోళ్ల ప్రదర్శనకు ఫిదా అయిన ప్రభుత్వం 2036 ఒలింపిక్స్ కోసం బిడ్ వేసే ఉత్సాహంలో ఉంది. టోక్యో ఒలింపిక్స్ ప్రభావం ఈసారి ఆసియాడ్‌లో కనిపించిందని విశ్లేషకులు చెబుతున్నారు. పతకాల పంట: అథ్లెటిక్స్, షూటింగ్‌లోనే (29, 22) ఎక్కువ పతకాలు దక్కాయి. భారత్ సాధించిన స్వర్ణాల్లో ఈ రెండు విభాగాల నుంచే సగం ఉన్నాయి. షూటింగ్‌లో ఏడు బంగారు పతకాలు నెగ్గగా.. అథ్లెట్లు ఆరు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఆర్చరీలో ఐదు పసిడి పతకాలు సహా తొమ్మిది పతకాలు లభించాయి. జ్యోతి సురేఖ, ఓజాస్ డియోతలే హ్యాట్రిక్ గోల్డ్‌లతో మెరిశారు. 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో అవినాష్ సబ్లే, జావెలియన్ త్రోయర్ అన్నూ రాణి, 5వేల మీటర్లలో పారుల్ చౌదరి దేశానికి తొలి బంగారు పతకాలు అందించారు. ఇక, 4గీ400 రిలే జట్టు 61 ఏళ్లలో తొలిసారి స్వర్ణంతో తళుక్కుమంది. షూటింగ్‌లో ఇషా సింగ్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ నాలుగేసి పతకాలతో ఔరా అనిపించగా.. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో సిఫ్ట్ కౌర్ శర్మ రికార్డు స్వర్ణంతో మెరిసింది. గోల్డ్ కొట్టి.. పారిస్ బెర్త్ పట్టి..: టోర్నీ ఆసాంతం ఆధిపత్యం ప్రదర్శించిన భారత పురుషుల హాకీ జట్టు స్వర్ణంతోపాటు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఫైనల్లో జపాన్‌ను 5-1తో చిత్తు చేయడం ఒక ఎత్తయితే.. అంతకుముందు చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 10-2తో చిత్తు చేయడం మరో ఎత్తు. 180 మ్యాచ్‌ల్లో పాక్‌పై భారత్‌కు ఇదే భారీ గెలుపు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత మహిళల జట్టు కాంస్యంతో సరిపెట్టుకుంది. టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న-రుతుజా భోసాలే జంట స్వర్ణం సాధించగా, స్క్వాష్‌లో రెండు పసిడి పతకాలు లభించాయి. క్రికెట్‌లో అఫ్ఘానిస్థాన్‌తో ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయినా.. మెరుగైన సీడింగ్ కారణంగా టీమిండియా పసిడి సొంతం చేసుకొంది. ఇక కబడ్డీలో డిఫెండింగ్ చాంప్ ఇరాన్‌తో ఫైనల్ పోరు వివాదాస్పదమైనా.. భారత్ మళ్లీ పసిడి నెగ్గడం ఊరటనిచ్చే విషయం. అమ్మాయిలు కూడా తిరిగి స్వర్ణాన్ని దక్కించుకొన్నారు.

# సంరంభం సమాప్తం


హాంగ్జౌ: ఎంత ఘనంగా ఆరంభమయ్యాయో అంతకంటే చిరస్మరణీయంగా ఆసియా క్రీడలు ముగిశాయి. ప్రారంభోత్సవంలో ఉపయోగించిన సాంకేతికత ఔరా అనిపిస్తే..ముగింపోత్సవంలో వాడిన టెక్నాలజీ సంభ్రమాశ్చర్యాలకు లోను చేసింది. మొత్తంగా అథ్లెట్ల కళ్లు చెదిరే విన్యాసాలు, చైనా సాంస్కృతిక వారసత్వాన్ని అద్భుత రీతిలో చాటిన ఆదివారంనాటి ముగింపు కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. హాంగ్జౌ ఒలింపిక్ స్పోర్ట్స్ సెంటర్ స్టేడియంలో 75 నిమిషాలు సాగిన ముగింపోత్సవం హాజరైన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ముఖ్యంగా లైట్, లేజర్, సౌండ్ షో మరో లోకంలోకి తీసుకు పోయింది. రెండు వారాలపాటు పోటీల్లో తీవ్రంగా తలపడి అలిసిపోయిన 45 దేశాల అథ్లెట్లకు ముగింపు కార్యక్రమాలు ఎంతో ఆహ్లాదాన్నిచ్చాయి. చైనా ప్రధాని లి క్వియాంగ్, ఇతర అతిథుల సమక్షంలో ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ తాత్కాలిక అధ్యక్షుడు రణధీర్ సింగ్ 19వ ఆసియా క్రీడలు ముగిసినట్టు ప్రకటించారు. '19వ ఆసియా క్రీడలు ముగిశాయి. మూడేళ్ల తర్వాత ఐచి నగోయా (జపాన్)లో 20వ ఆసియాడ్‌లో మరోసారి కలుద్దాం' అని రణధీర్ అన్నారు. 'గత పదహారు రోజులుగా మనం ఎన్నో మధురానుభూతులను పంచుకున్నాం. ఇంత గొప్ప ఆతిథ్యమిచ్చిన హాంగ్జౌ నగరానికి థ్యాంక్స్ చెప్పాల్సిన సమయం వచ్చేసింది. వచ్చే ఆసియా క్రీడలనూ ఆసియా యువత సోదరభావం, మానవజాతి సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా జరుపుకొంటుందని ఆశిస్తున్నా' అని ఆయన అన్నారు. తొలుత..దేశాల జాతీయ జెండాలను చేబూనిన క్రీడాకారులు స్టేడియంలోకి ప్రవేశించగా..ఆపై ఇతర అథ్లెట్లు, అధికారులు వారిని అనుసరించారు. పురుషుల హాకీ జట్టు గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ భారత పతాకధారిగా వ్యవహరించాడు. మొత్తం 100 మంది భారత క్రీడాకారులు, అధికారులు పరేడ్‌లో భాగస్వాములయ్యారు. కాగా..45 దేశాలనుంచి 40క్రీడాంశాల్లో మొత్తం 12,407 మంది అథ్లెట్లు పోటీలలో పాల్గొన్నారు. వాస్తవంగా ఈ ఆసియా క్రీడలు ఏడాది కిందటే జరగాల్సి ఉంది. కానీ కొవిడ్‌తో ఆలస్యం అయ్యాయి.

# 'కివీస్ తమ స్థాయిని చూపించింది'

కృష్ణమాచారి శ్రీకాంత్



తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై సాధించిన ఘనవిజయం కారణంగా న్యూజిలాండ్ గురించి ఇప్పుడు ఇతర టీమ్‌ల దృష్టి కోణం మారి ఉంటుంది. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఇంగ్లండ్‌ను కివీస్ దెబ్బకొట్టింది. వేగంగా లక్ష్యం చేరిన ఆ జట్టు గెలుపుతో పాటు మెరుగైన రన్‌రేట్‌ను కూడా సాధించింది. ఇలాంటి పెద్ద టోర్నీల్లో సెమీస్ చేరేందుకు రన్‌రేట్ కూడా కీలకంగా మారుతుంది. తర్వాతి మ్యాచ్‌లో కివీస్‌కు నెదర్లాండ్స్ పోటీనిచ్చే అవకాశం కనిపించడం లేదు. పాకిస్తాన్‌తో మ్యాచ్‌నూ మెరుగ్గానే ఆరంభించినా 'డచ్' దానిని నిలబెట్టుకోలేకపోయింది. డి లీడ్ అద్భుతంగా ఆడినా ఇలాంటి మ్యాచ్‌లో ఒకరికంటే ఎక్కువ మంది మంచి ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో కాన్వే, రచిన్ అదే చూపించారు. కాన్వే ఐపీఎల్‌లో ఇప్పటికే సత్తా చాటగా, రచిన్ కొత్తగా వచ్చాడు. రాహుల్, సచిన్ పేర్లను కలిపి పెట్టుకున్న అతను వారిద్దరు గర్వపడేలా ఆడాడు. అతని బ్యాటింగ్‌లో రవీంద్ర జడేజా పోలికలు కనిపిస్తున్నాయి. అతనిలాగే ఇతనూ లెఫ్టార్మ్ స్పిన్నరే. ముగ్గురు టాప్ ఆటగాళ్లు కలగలిసిన వ్యక్తి అంటే అతని ఆట కూడా అంతే స్థాయిలో ఉండాలి కదా. భారతీయ మూలాలు ఉన్న రచిన్ ఆట శైలి కూడా సగటు న్యూజిలాండర్‌లా లేదు. చక్కటి టైమింగ్, పదునైన స్ట్రోక్‌లతో ఇంగ్లండ్ బౌలింగ్‌ను దెబ్బ కొట్టిన అతని ఆట నాకు బాగా నచ్చింది. విలియమ్సన్‌లాంటి పలువురు కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగి కూడా న్యూజిలాండ్ 9 వికెట్ల ఘనవిజయంతో టోర్నీ తొలి మ్యాచ్‌లోనే తమ స్థాయిని ప్రదర్శించింది. నేటి మ్యాచ్‌లో నెదర్లాండ్స్ కూడా చివరి వరకు పోరాడవచ్చేమో కానీ కివీస్‌కు మరో రెండు పాయింట్లు రాకపోతే ఆశ్చర్యపోవాల్సిందే.




# భయపెట్టినా బాదేశారు

### భారత్ శుభారంభం

### రాహుల్, కోహ్లీ అద్భుత పోరాటం

### ఆరు వికెట్లతో ఆసీస్ పరాజయం

చెన్నై: కేవలం 200 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ రెండు పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన వేళ.. స్టార్ బ్యాటర్లు కేఎల్ రాహుల్ (115 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 97 నాటౌట్), విరాట్ కోహ్లీ (116 బంతుల్లో 6 ఫోర్లతో 85)ల అసాధారణ ఆటతీరుతో వహ్వా.. అనిపించారు. తమ అపార అనుభవంతో తీవ్ర ఒత్తిడిని తట్టుకుంటూ ఆసీస్ పేసర్లను దీటుగా ఎదుర్కొంటూ జట్టును విజయతీరాలకు చేర్చారు. దీంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 49.3 ఓవర్లలో 199 పరుగులకు ఆలౌటైంది. స్మిత్ (46), వార్నర్ (41), స్టార్క్ (28) మాత్రమే రాణించారు. జడేజాకు మూడు.. కుల్దీప్, బుమ్రాలకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో భారత్ 41.2 ఓవర్లలో 4 వికెట్లకు 201 పరుగులు చేసి గెలిచింది. హాజెల్‌వుడ్‌కు మూడు వికెట్లు దక్కాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా రాహుల్ నిలిచాడు. మరోవైపు చెపాక్‌లో ఆడిన నాలుగు వరల్డ్‌కప్ మ్యాచ్‌ల్లో ఆసీస్ ఓడడం ఇదే తొలిసారి. విరాట్, రాహుల్ పోరాటం: 200 పరుగుల స్వల్ప ఛేదనలో భారత్‌కు ఆరంభంలో తగిలిన షాక్‌లతో గెలుపుపై సందేహాలు మొదలయ్యాయి. ఏం జరుగుతుందో తెలిసేలోపే రెండు పరుగులకే ఇషాన్, రోహిత్, శ్రేయాస్ డకౌట్లుగా పెవిలియన్‌లో కూర్చున్నారు. అప్పటికి రెండు ఓవర్లు మాత్రమే పూర్తయ్యాయి. తొలి ఓవర్‌లోనే ఇషాన్‌ను స్టార్క్ అవుట్ చేయగా.. ఒకే ఓవర్‌లో హాజెల్‌వుడ్ రెండు వికెట్లు తీశాడు. ఈ దశలో ఆసీస్ బౌలర్లు బంతికో వికెట్ తీసేలా కనిపించారు. కానీ అపార అనుభవజ్ఞుడు కోహ్లీతో పాటు కేఎల్ రాహుల్ పెట్టని కోటలా భారత్‌కు అండగా నిలిచారు. ముందు వికెట్ కాపాడుకోవడంపై దృష్టి సారించారు. 8వ ఓవర్‌లో కోహ్లీ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను మార్ష్ వదిలేయడం కలిసివచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ విరాట్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. అటు రాహుల్ కూడా చక్కటి సమన్వయం కనబర్చాడు. లక్ష్యం తక్కువే ఉండడంతో పొరపాటున కూడా రిస్కీ షాట్లకు వెళ్లకుండా టెస్టు తరహా ఆటను ప్రదర్శించారు. స్పిన్నర్ జంపాను లక్ష్యంగా చేసుకుని పరుగులు రాబట్టారు. ఇదే క్రమంలో ఇద్దరూ అర్ధసెంచరీలు పూర్తి చేసుకోవడంతో పాటు జట్టును విజయం వైపు నడిపించారు. ఇక సెంచరీ ఖాయమనుకున్న వేళ హాజెల్‌వుడ్ షార్ట్ బాల్‌ను ఆడే ప్రయత్నంలో కోహ్లీ మిడ్ వికెట్‌లో లబుషేన్‌కు చిక్కాడు. కానీ అప్పటికే నాలుగో వికెట్‌కు 165 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదైంది. విజయానికింకా 74 బంతుల్లో 33 పరుగులు కావాల్సి ఉండడంతో భారత్ ఇబ్బందిపడలేదు. 40వ ఓవర్‌లో పాండ్యా (11 నాటౌట్) సిక్సర్, తర్వాతి ఓవర్‌లో 6,4 బాదిన రాహుల్ మరో సిక్సర్‌తోనే మ్యాచ్‌ను ముగించినా శతకానికి మూడు పరుగుల దూరంలో నిలిచాడు. దెబ్బతీసిన జడేజా: పిచ్‌పై గడ్డి లేకపోవడం, పొడిబారి ఉండడంతో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీసను భారత స్పిన్నర్లు కుదురుకోనీయలేదు. మధ్య ఓవర్లలో వీరి ధాటికి పరుగులు తీసేందుకు తెగ ఇబ్బందిపడ్డారు. సీఎసకే తరఫున ఆడే జడేజాకు చెపాక్ మైదానం కొట్టినపిండి. దీంతో ఆసీస్ బ్యాటర్లను ఆటాడేసుకున్నాడు. తనతోపాటు అశ్విన్, కుల్దీప్ కలిసి 101 డాట్ బాల్స్ వేయడం విశేషం. వీరి ధాటికి ఓ దశలో 73 బంతులపాటు ఆసీస్ ఒక్క ఫోర్ కూడా సాధించలేకపోయింది. ఇంకా చెప్పాలంటే 40వ ఓవర్‌లో కానీ తొలి సిక్సర్ నమోదు కాలేదు. వార్నర్, స్మిత్ మాత్రమే ఫర్వాలేదనిపించగా.. ఆఖర్లో స్టార్క్ విసిగించడంతో ఆసీస్ ఆ మాత్రం స్కోరైనా సాధించింది. మూడో ఓవర్‌లోనే పేసర్ బుమ్రా ఓపెనర్ మార్ష్‌ను డకౌట్ చేశాడు. తొలి స్లిప్‌లో కోహ్లీ చక్కటి డైవింగ్ క్యాచ్ అందుకున్నాడు. ఈ దశలో వార్నర్-స్మిత్ జోడీ ఓపిగ్గా ఆడింది. ఇది భారీ స్కోరు సాధించే పిచ్ కాదనే అవగాహనతో జాగ్రత్త కనబరిచారు. 14 ఓవర్లపాటు క్రీజులో నిలిచిన వీరు రెండో వికెట్‌కు 69 పరుగులు జోడించారు. 17వ ఓవర్‌లో కుల్దీపకు రిటర్న్ క్యాచ్ ఇస్తూ వార్నర్ వెనుదిరిగాడు. అనంతరం లబుషేన్ (27)తో కలిసి స్మిత్ మూడో వికెట్‌కు 36 రన్స్ జోడించాడు. జడేజా రాకతో వీరి కష్టాలు మరింత పెరిగాయి. వరుస ఓవర్లలో స్మిత్, లబుషేన్, క్యారీ (0) వికెట్లు తీయడంతో 110/2 స్కోరు నుంచి 119/5తో కష్టాల్లో పడింది. అన్ని ఫార్మాట్లలో కలిపి స్మిత్‌ను అవుట్ చేయడం జడేజాకిది పదోసారి. ఈసారి కూడా మిడిల్‌లో పడిన బంతిని స్మిత్ డిఫెన్స్ ఆడబోగా అనూహ్యంగా టర్న్ అవుతూ ఆఫ్ స్టంప్‌ను పడగొట్టేసింది. అలాగే ప్రమాదకర మ్యాక్స్‌వెల్ (15)ను కుల్దీప్ బౌల్డ్ చేయడం ఆసీసను దెబ్బతీసింది. ఆఖర్లో స్టార్క్ మాత్రం ఎనిమిదో వికెట్‌కు కమిన్స్ (15)తో కలిసి 25 రన్స్, తొమ్మిదో వికెట్‌కు జంపా (6)తో కలిసి 24 పరుగులు జోడించి ఆసీస్ పరువు కాపాడాడు.

### స్కోరు బోర్డు

ఆస్ట్రేలియా: వార్నర్ (సి అండ్ బి) కుల్దీప్ 41బీ మార్ష్ (సి) కోహ్లీ (బి) బుమ్రా 0బీ స్మిత్ (బి) జడేజా 46బీ లబుషేన్ (సి) రాహుల్ (బి) జడేజా 27బీ మ్యాక్స్‌వెల్ (బి) కుల్దీప్ 15బీ క్యారీ (ఎల్బీ) జడేజా 0బీ గ్రీన్ (సి) హార్దిక్ (బి) అశ్విన్ 8బీ కమిన్స్ (సి) శ్రేయాస్ (బి) బుమ్రా 15బీ స్టార్క్ (సి) శ్రేయాస్ (బి) సిరాజ్ 28బీ జంపా (సి) కోహ్లీ (బి) హార్దిక్ 6బీ హాజెల్‌వుడ్ (నాటౌట్) 1బీ ఎక్స్‌ట్రాలు: 12బీ మొత్తం: 49.3 ఓవర్లలో 199 ఆలౌట్. వికెట్ల పతనం: 1-5, 2-74, 3-110, 4-119, 5-119, 6-140, 7-140, 8-165, 9-189, 10-199. బౌలింగ్: బుమ్రా 10-0-35-2బీ సిరాజ్ 6.3-1-26-1బీ హార్దిక్ 3-0-28-1బీ అశ్విన్ 10-1-34-1బీ కుల్దీప్ 10-0-42-2బీ జడేజా 10-2-28-3.

భారత్: రోహిత్ (ఎల్బీ) హాజెల్‌వుడ్ 0బీ ఇషాన్ (సి) గ్రీన్ (బి) స్టార్క్ 0బీ విరాట్ (సి) లబుషేన్ (బి) హాజెల్‌వుడ్ 85బీ శ్రేయాస్ (సి) వార్నర్ (బి) హాజెల్‌వుడ్ 0బీ రాహుల్ (నాటౌట్) 97బీ హార్దిక్ (నాటౌట్) 11బీ ఎక్స్‌ట్రాలు: 8బీ మొత్తం: 41.2 ఓవర్లలో 201/4. వికెట్ల పతనం: 1-2, 2-2, 3-2, 4-167. బౌలింగ్: స్టార్క్ 8-0-31-1బీ హాజెల్‌వుడ్ 9-1-38-3బీ కమిన్స్ 6.2-0-33-0బీ మ్యాక్స్‌వెల్ 8-0-33-0బీ గ్రీన్ 2-0-11-0బీ జంపా 8-0-53-0.

Edited, Printed, Published & owned by GOSUKONDA PRUDHVIRAJU, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar PUBLICATIONS, H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: GOSUKONDA PRUDHVIRAJU,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in